సాక్షి నల్లగొండ

సోమవారం । 26 । జూన్ । 2023



హైవేపై.. పోలీస్ ఫోకస్ !

జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు పోలీస్ యంత్రాంగం ప్రత్యేక చర్యలకు శ్రీకారం చుట్టింది.

- 8లో



మెనూ పాటించాలని ధర్నా

మోత్కూరు బాలుర గురుకులంలో భోజనం మెనూ పాటించాలని ఆదివారం అఖిలపక్ష, విద్యార్థి సంఘాలు ధర్నా చేపట్టాయి.

- 10లో

గరిష్టం/కనిష్టం

31°/26°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

27న సైన్స్ టీచర్లకు టెలీ కాన్ఫరెన్స్

రామగిరి(నల్లగొండ) : రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈ నెల 27న ఇన్‌స్పైర్ అవార్డ్స్ నామినేషన్లపై సైన్స్ ఉపాధ్యాయులకు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు డీఈఓ భిక్షపతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌స్పైర్ అవార్డ్స్ నామినేషన్లపై విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకను వెలికితీసేందుకు వినూత్న ఆలోచనలతో ప్రాజెక్టులు తయారు చేసేలా శిక్షణ ఇస్తారని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు, సైన్స్, గణిత ఉపాధ్యాయులు టెలీ కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మిపతి 9848578845 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

'తొలిమెట్టు' పరిశీలకుడిగా నర్సింగరావు



నర్సింగరావు

చిట్యాల : ప్రభుత్వ పాఠశాలల్లో తొలిమెట్టు కార్యక్రమం అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకుగాను రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేసిన పరిశీలన బృందంలో సభ్యుడిగా చిట్యాల మండలం గుండ్రాంపల్లి జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సీహెచ్.నర్సింగరావు నియమితులయ్యారు. ఈ నెల 26వ తేదీ నుండి నల్లగొండ, సూర్యాపేట జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించి విద్యార్థుల అభ్యసనాంశాలను పరిశీలించనున్నారు.

పోరాట వీరులకు సన్మానం

నల్లగొండ టూటౌన్ : ఎమర్జెన్సీ వ్యతిరేక దినం సందర్భంగా ఆనాటి పోరాట వీరులను ఆదివారం నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ సీనియర్ నాయకుడు ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ ఇందిరాగాంధీ తన హయాంలో ఎమర్జెన్సీ తీసుకొచ్చి ప్రజలందరిని తీవ్ర ఇబ్బందులు పెట్టారని తెలిపారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా జనం రోడ్ల పైకి వచ్చి పోరాడాని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు శ్రీరామోజు షణ్ముఖ, వీరెళ్లి చంద్రశేఖర్, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, నిమ్మల రాజశేఖర్‌రెడ్డి, దాసోజు యాదగిరాచారి, మిర్యాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


విద్య కాషాయీకరణకు కేంద్రం కుట్ర



సమావేశంలో మాట్లాడుతున్న సోమయ్య

సూర్యాపేట టౌన్ : విద్యను కాషాయీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సోమయ్య మండిపడ్డారు. డీటీఎఫ్ సూర్యాపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన మధ్యంతర కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విద్యలోకి జాతకాలు, భూత తాంత్రిక విద్య లాంటి అశాస్త్రీయ భావనలను చొప్పిస్తూ డార్విన్ పరిణామం లాంటి శాస్త్రీయ అంశాలను తొలగిస్తూ భారతదేశాన్ని ప్రాచీన యుగాలకు తీసుకపోతుందన్నారు. సమావేశంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపాక లింగయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ.రావు, ఎం.దశరథరామారావు, కె.యోగానంద్, ఆనంద్, భాస్కర్, క్రాంతికుమార్, టి.ప్రభాకర్, రాజశేఖర్, రామకృష్ణ, వెంకటయ్య, వెంకట్‌రెడ్డి, కోటయ్య, పరమేష్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నారసింహుడికి నిత్యారాధనలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి పుణ్యక్షేత్రంలో ఆదివారం నిత్యారాధనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామునే ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాతం చేపట్టారు. అనంతరం స్వయంభూలకు బిందె తీర్థం, ఆరా..దన, బాలభోగం, నిజాభిషేకం, సహస్రనామార్చన చేపట్టి తులసీదళాలతో అర్చించారు. ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజ వాహనసేవ, నిత్యకల్యాణం, జోడు సేవలు జరిపించారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

గడువు దాటితే.. వడ్డింపే!

- మున్సిపాలిటీల్లో మొదటి అర్ధ సంవత్సరం పన్ను చెలింపునకు ఈ నెలాఖరు వరకు అవకాశం
- గడువులోగా చెల్లించకపోతే పన్ను మొత్తంపై ప్రతి నెలా 2 శాతం వడ్డీ
- ఏప్రిల్‌లోనే చెల్లిస్తే 5 శాతం రాయితీ
- అవగాహన లేక ముందస్తుగా చెల్లించని భవన యజమానులు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : మున్సిపాలిటీల్లో గడువులోగా ఆస్తి పన్ను చెల్లించకపోతే వడ్డీ పడనుంది. ఈనెల 30వ తేదీ దాటితే ఆస్తి పన్నుపై ప్రతి నెలా 2 శాతం చొప్పున వడ్డీ వసూలు చేసేందుకు మున్సిపాలిటీలు సిద్ధమవుతున్నాయి. నిబంధనల ప్రకారం మున్సిపాలిటీల్లో భవన యజమానులు ఏటా రెండుసార్లు (ఆరు నెలకు ఒకసారి) ఆస్తి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు మొదటి అర్ధ సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నును జూన్ నెలాఖరులోగా చెల్లించాలి. కానీ ఏటా ఫిబ్రవరి/మార్చి నెలలో ఆస్తి పన్ను చెల్లిస్తే సరిపోతుందనే భావనలో ప్రజలు ఉంటున్నారు. అసలు పన్ను చెల్లింపు విషయంలో ప్రజలకు అవగాహన లేకపోవడంతో వడ్డీ భారం తప్పడం లేదు.

పన్నుల వసూలు ఇలా..

నల్లగొండ జిల్లాలో ఎనిమిది మున్సిపాలిటీలు ఉండగా.. నందికొండ మున్సిపాలిటీలో పన్నులు ఇంకా వసూలు చేయడం లేదు. మిగిలిన ఏడు మున్సిపాలిటీల్లో పన్నుల పరిస్థితి ఇలా ఉంది.

- రెండు లక్షలకుపైగా జనాభా ఉన్న నీలగిరిలో 40 వేల నిర్మాణాలు ఉన్నాయి. వాటి ద్వారా 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.21.50 కోట్ల ఆస్తి పన్ను వసూలైంది. ఈసారి రూ.30 కోట్లు వస్తుందని అధికారులు అంచనా వేశారు. మొదటి అర్ధ సంతవ్సరానికి రూ.15 కోట్ల పన్ను వసూలు లక్ష్యంగా పెట్టుకున్నారు. అందులో ఏప్రిల్ నెలలోనే ఎర్లీ బర్డ్ స్కీం కింద 6,500 మంది తమ ఆస్తి పన్ను చెల్లించగా, రూ.6.50 కోట్ల ఆదాయం సమకూరింది. వారందరికీ 5 శాతం పన్ను రాయితీ లభించింది. ఇప్పటి వరకు మొత్తం రూ.8.50 కోట్ల పన్ను వసూలైంది.
- దేవరకొండ మున్సిపాలిటీలో 6,809 నిర్మాణాలు ఉండగా, వాటి ద్వారా రూ.1.97 కోట్లు ఆస్తి పన్ను రావాల్సి ఉంది. మొదటి అర్ధ సంవత్సరానికి సంబంధించి రూ.98.50 లక్షలు వసూలు కావాల్సి ఉంది. ఇప్పటి వరకు 2,221 నిర్మాణాలపై రూ.87.58 లక్షలు పన్ను వసూలైంది. మరో 4,588 నిర్మాణాలకు సంబంధించి రూ.1.09 కోట్లు రావాల్సి ఉంది.
- చిట్యాల మున్సిపాలిటీలో 3,454 నిర్మాణాల ద్వారా రూ.91.13 లక్షలు ఆస్తి పన్ను రూపంలో రావాల్సి ఉంది. అందులో మొదటి ఆరు నెలలకు రూ.45.56 లక్షలు ఈనెలాఖరులోగా వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు 650 నిర్మాణాల ద్వారా రూ.26.53 లక్షలు వసూలైంది. ఇంకా 2803 నిర్మాణాలకు సంబంధించి రూ.64.06 లక్షలు రావాల్సి ఉంది. ఇప్పటి వరకు వసూలైన దాంట్లో 5 శాతం రాయితీతో 460 మంది రూ.21.44 లక్షలు చెల్లించారు.
- హాలియా మున్సిపాలిటీలో 5,459 ఆవాసాల ద్వారా రూ.1.98 కోట్లు వసూలు లక్ష్యం కాగా, అందులో మొదటి ఆరునెలల్లో రూ.99 లక్షలు వసూలు కావాలి. ఇప్పటి వరకు 2,021 ఆవాసాలకు కింద రూ.59 లక్షలు చెల్లించారు. ఇంకా 3,438 ఆవాసాలకు సంబంధించి రూ.1.39 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఇక ఇప్పటివరకు వసూలైన దాంట్లో 5 శాతం రాయితీతో 1600 మంది రూ.22లక్షలు చెల్లించారు.
- మిర్యాలగూడ మున్సిపాలిటీలో 25,349 నిర్మాణాల ద్వారా రూ.23.66 కోట్లు ఆస్తి పన్ను రావాల్సి ఉంది. అందులో మొదటి ఆరు నెలలకు రూ.11.83 కోట్లు వసూలు కావాల్సి ఉండగా, ఇప్పటి వరకు 4,793 గృహాల నుంచి రూ.2.99 కోట్లు వసూలైంది. ఇంకా రూ. 20.67 కోట్లు వసూలు కావాల్సి ఉంది. వసూలైన మొత్తంలో 5 శాతం రాయితీతో 2,221 మంది రూ.2.15 కోట్లు చెల్లించారు.
- నకిరేకల్ మున్సిపాలిటీలో 8,675 నివాస గృహాలు ఉన్నాయి. వాటి ద్వారా రూ.1.60 కోట్లు వసూలు కావాల్సి ఉంది. మొదటి ఆరు నెలలకు రూ.80 లక్షలు వసూలు కావాల్సి ఉంది. ఇప్పటి వరకు 971 మంది రూ.33 లక్షలు చెల్లించారు. ఇంకా 7,704 గృహాలకు సంబంధించి రూ.1.27 కోట్లు వసూలు కావాల్సి ఉంది. 5 శాతం రాయితీ కింద 521 గృహాల వారు రూ.12.48 లక్షలు చెల్లించారు.
- చండూరు మున్సిపాలిటీలో 3,413 నిర్మాణాల నుంచి రూ.50 లక్షలు రావాల్సి ఉంది. మొదటి అర్ధ సంవత్సరానికి రూ.25 లక్షలు వసూలు కావాల్సి ఉంది. ఇప్పటి వరకు 1166 కుటుంబాల నుంచి రూ.15.02 లక్షలు వసూలైంది. మిగతా 2,247 ఇళ్ల నుంచి రూ.34.97 లక్షలు వసూలు కావాల్సి ఉంది.

స్వచ్ఛందంగా పన్ను చెల్లించండి



ప్రజలు స్వచ్ఛందంగా పన్ను చెల్లించండి. డిమాండ్ నోటీసులు ఎవరికైనా రాకపోతే మున్సిపాలిటీలో సంప్రదించండి. పన్నులో తేడాలు ఉంటే మా దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తాం. సకాలంలో చెల్లిస్తే ఆలస్య రుసుము ఉండదు.

– కేవీ.రమణాచారి, నల్లగొండ మున్సిపల్ కమిషనర్

మున్సిపాలిటీలు నోటీసులు జారీ చేస్తున్నా..

నిబంధనల ప్రకారం ఏటా ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు వేసే ఆస్తి పన్ను నోటీసులను ప్రజలకు సంబంధిత మున్సిపాలిటీ మే/జూన్ నెలల్లో జారీ చేస్తోంది. జూన్ 30లోగా చెల్లించాలని చెబుతోంది. ఇక అక్టోబర్ నుంచి మార్చి నెలకు సంబంధించిన పన్నును డిసెంబర్‌లో చెల్లించాల్సి ఉన్నా పట్టించుకోకపోవడంతో 2 శాతం వడ్డీ తప్పడం లేదు. మరోవైపు డిమాండ్ నోటీసు జారీ చేయక ముందు, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎర్లీ బర్డ్ స్కీం కింద ఏప్రిల్ నెలలోనే ముందస్తుగా పన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ కూడా ఉంది. దానిని ప్రజలు పెద్దగా పట్టించుకోవడం లేదు. ఇక, జూన్ నెలాఖరులోగా చెల్లించకపోవడంతో వేల మంది అదనంగా వడ్డీని చెల్లించాల్సి వస్తుంది. గడువులోగా చెల్లించకపోతే 2 శాతం వడ్డీతో కలిపి ఆటోమెటిక్‌గా పన్ను ఆన్‌లైన్‌లో జనరేట్ అవుతుంది.



వైఎస్సార్ చౌరస్తా విస్తరణ కోసమని విగ్రహ దిమ్మెను తొలగించిన అధికారులు

వైఎస్సార్ విగ్రహంపై వివక్ష

- నీలగిరిలో రోడ్డు విస్తరణలో భాగంగా పూర్తిగా తొలగించేందుకు యత్నం
- ఆ స్థానంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం పెట్టేందుకు ఓ నేత సన్నాహాలు
- వైఎస్ విగ్రహాన్ని పునః ప్రతిష్ఠించాలని అభిమానుల డిమాండ్

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలో మహానేత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని పూర్తిగా తొలగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనిపై వైఎస్సార్ అభిమానులు మండిపడుతున్నారు. వైఎస్ విగ్రహం స్థానంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం పెట్టేందుకు పట్టణానికి చెందిన ఓ నేత ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. అయితే ఆ ప్రాంతంలోనే కాకుండా మరో చోట సర్దార్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి జాతీయ నేతలను గౌరవించవచ్చుకదా.. అని పలువురు పేర్కొంటున్నారు.

మిగతా విగ్రహాలు ఎక్కడివి అక్కడే..

నీలగిరిలో రోడ్ల విస్తరణ సందర్భంగా మహనీయుల విగ్రహాలు ఎక్కడ ఉన్నాయో అక్కడే పునః ప్రతిష్ఠించారు. అలాగే రోడ్డు విస్తరణ కోసం వైఎస్సార్ విగ్రహాన్ని కూడా ఇటీవల తొలగించారు. కానీ పునః ప్రతిష్ఠించే విషయంలో మాత్రం ఎందుకు వివక్ష చూపిస్తున్నారు అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రముఖ నటుడు జూనియర్ ఎన్టీఆర్ సైతం వైఎస్సార్, ఎన్టీఆర్ ఇద్దరు కూడా ప్రజల గుండెల్లో చిర స్థాయిగా నిలిచిన మహోన్నతులు అని ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ఎన్టీఆర్ విగ్రహం నీలగిరి నడి బొడ్డున ఉంచి, వైఎస్సార్ విగ్రహం విషయంలో వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పేదల గుండెల్లో నిలిచిన నేత వైఎస్సార్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుదీర్ఘ పాదయాత్ర నిర్వహించి 2004లో ముఖ్యమంత్రి అయిన డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో నిలిచిపోయారు. పేదలకు లక్షలాది ఇందిరమ్మ ఇళ్లు నిర్మించిన ఘనత వైఎస్సార్‌ది. రైతులకు ఉచిత కరెంట్, రైతాంగానికి రుణమాఫీ చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్సార్. అలాంటి మహోన్నత వ్యక్తి విగ్రహం తొలగించాలనే ఆలోచన చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సదరు నేత మనసు మార్చుకోకపోతే వివిధ సామాజిక వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంది.

వైఎస్సార్ చౌరస్తాగా పేరు..

2010లో వైఎస్సార్ మరణానంతరం నీలగిరి పట్టణంలోని సాగర్ రోడ్డు వద్ద చౌరస్తాలో ఆయన విగ్రహం ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఆ ప్రాంతం వైఎస్సార్ చౌరస్తాగా పేరు పొందింది. మనం గూగుల్‌లో చూసినా అక్కడ వైఎస్సార్ చౌరస్తా అని చూపిస్తోంది. కాగా తెలంగాణ ఉద్యమంలో గుర్తు తెలియన వ్యక్తులు వైఎస్ విగ్రహానికి నిప్పు పెట్టడంతో అది సగం వరకు కాలిపోయింది. అయినప్పటికీ అక్కడ వైఎస్సార్ చౌరస్తాగానే జనమంతా పిలుచుకుంటున్నారు. ఇంతటి పేరున్న వైఎస్ విగ్రహాన్ని తొలగించాలనే ఓ నేత నిర్ణయాన్ని పట్టణ ప్రజలతో పాటు వైఎస్ అభిమానులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. విగ్రహం విషయంలో సదరు నేతకు రాజకీయాల్లో మంచి కంటే చెడే ఎక్కువగా జరిగే అవకాశం ఉందని అంటున్నారు.

వైఎస్ విగ్రహాన్ని పునః ప్రతిష్ఠించాలి



ముఖ్యమంత్రిగా పని చేసిన వైఎస్సార్ విగ్రహాన్ని ఆ చౌరస్తాలోనే పునః ప్రతిష్ఠించాలి. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన వైఎస్ విగ్రహం విషయంలో రాజకీయం చేయడం మంచిది కాదు. ఆయనను పార్టీలకు అతీతంగా అందరూ అభిమానిస్తారు. వైఎస్ విగ్రహం తొలగిస్తే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తాం.

– గుమ్ముల మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు

విగ్రహం తొలగింపు ఆలోచన విరమించుకోవాలి



ఎంతో మంది హృదయాల్లో నిలిచిన వైఎస్ విగ్రహం ఎక్కడ ఉందో అక్కడే పునః ప్రతిష్ఠించాలి. విగ్రహం తొలగింపు ఆలోచనను విరమించుకోవాలి. మైనార్టీలకు రిజర్వేషన్లు తీసుకొచ్చిన మహానేత వైఎస్సార్. అలాంటి నేత విగ్రహం తొలగించాలనుకోవడం మంచి పద్ధతి కాదు.

– బషీరుద్దీన్, బీఆర్ఎస్ నాయకుడు

ప్రజల గుండెల్లో నుంచి వైఎస్‌ను వేరు చేయలేరు



వైఎస్ మరణించి 14 సంవత్సరాలు అవుతున్నా అన్ని వర్గాల ప్రజల్లో నిలిచిపోయిన మహానేత. అలాంటి మహనీయుడి విగ్రహం తొలగిస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరు. ఇతర మహనీయుల విగ్రహాలు పెట్టాలనుకుంటే మరో చోట ప్రతిష్ఠించాలి. కానీ వైఎస్ విగ్రహం తొలగిస్తే మాత్రం ప్రజలు తగిన సమయంలో బుద్ధిచెబుతారు.

– మేడిశెట్టి యాదయ్య, వైఎస్ అభిమాని, నల్లగొండ

విగ్రహ తొలగింపు మానుకోవాలి

వైఎస్సార్ అంటే దీ గ్రేట్ లీడర్. సీఎం హోదాలో చనిపోయిన వ్యక్తి విగ్రహం పెట్టి గౌరవించుకున్నాం. అలాంటి వ్యక్తి విగ్రహం తొలగింపు ఆలోచనను మానుకోవాలి. ఎక్కడ ఉందో అక్కడే పునః ప్రతిష్ఠించి ప్రజా ప్రతినిధులు తమ గౌరవం రెట్టింపు చేసుకోవాలి. లేకుంటే ప్రజలు అన్నీ గమనిస్తూనే ఉంటారన్న విషయం తెలుసుకోవాలి.

– బాలకృష్ణారెడ్డి, నల్లగొండ

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తాం

- ఇది నా మాటే కాదు.. కాంగ్రెస్ మాట
- పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



భట్టి విక్రమార్కను గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అర్హులైన పేదలు ఇల్లు కట్టుకునేందుకు రూ.5 లక్షలు అందిస్తామని, అలాగే రూ.1,250 ఉన్న గ్యాస్ సిలిండర్‌ను కేవలం రూ.500లకే అందిస్తామని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. అలాగే రేషన్‌కార్డులు ఇచ్చి తొమ్మిది రకాల నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తామని తెలిపారు. ఇది నా మాటే కాదు.. కాంగ్రెస్ మాటగా పేర్కొన్నారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఆదివారం 103వ రోజు సూర్యాపేట పట్టణంలో కొనసాగింది. సైనిక్‌పురి కాలనీ నుంచి కృష్ణాటాకీస్, ఎడ్ల గోపయ్య విగ్రహం, పూల సెంటర్, కూరగాయల మార్కెట్ రోడ్డు మీదుగా శంకర్ విలాస్ సెంటర్‌కు చేరుకుంది. అక్కడ జరిగిన కార్నర్ మీటింగ్‌లో భట్టి మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన సూర్యాపేట గడ్డపై నుంచి మాట్లాడే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు.

ఎల్‌కేజీ నుంచి ఉచిత నిర్బంధ విద్య

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రతి బిడ్డకు ఎల్‌కేజీ నుంచి ఉచిత నిర్బంధ విద్యను అందిసస్తామన్నారు. ఆరోగ్యశ్రీని రూ.2 లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచుతామన్నారు. కూలి పనులు చేసుకునే వారికి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించి ఆదుకుంటామన్నారు. సూర్యాపేట నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి డిగ్రీ కళాశాల, అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలను మంజూరు చేస్తామని తెలిపారు. సూర్యాపేటలో కాంగ్రెస్ నాయకులు తన్నుకుంటారని.. ఈ సారి కూడా తాను గెలుస్తానని మంత్రి జగదీశ్‌రెడ్డి ఎదురు చూస్తున్నాడన్నారు. ఈ సారి అలాంటిదేమీ జరగదన్నారు. సూర్యాపేటలో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందన్నారు. కార్నర్ మీటింగ్ అనంతరం పాదయాత్ర ఖమ్మం క్రాస్ రోడ్డు మీదుగా చివ్వెంల మండల బీబీగూడెం వద్దకు చేరుకుంది. పాదయాత్రకు పార్టీ సీనియర్ నాయకుడు జగ్గారెడ్డి మద్దతు తెలిపి పాల్గొన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు, మాజీ మంత్రి, పీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎన్.పద్మావతి, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి, సీనియర్ ఉపాధ్యక్షుడు దామోదర్‌రావు, ఏఐసీసీ సభ్యురాలు స్రవంతి, ప్రీతమ్, మమతారెడ్డి, జ్ఞానసుందర్, వెంకన్న నాయక్, బాలలక్ష్మి, రవికుమార్ పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి క్షేత్రంలో ఆదివారం శ్రీరాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామున ఆలయంలో సుప్రభాత సేవతో పూజలు ప్రారంభమయ్యాయి. శ్రీస్వామివారికి కృష్ణానది నుంచి బిందెతీర్థం తెచ్చి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. శ్రీస్వామి అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు చేపట్టారు. స్వామిఅమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఆలయం ముఖ మండపంలో ఎదుర్కోలు నిర్వహించారు. అనంతరం నిత్యకల్యాణాన్ని నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు భక్తులు పాల్గొన్నారు.

హక్కులను హరిస్తున్న పాలకులు

- ప్రొఫెసర్ హరగోపాల్

నల్లగొండ టౌన్ : భారతదేశంలోని ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పాలకులు హరిస్తున్నారని.. దీనిపై ప్రశ్నించకుంటే భవిష్యత్ తరాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు అందవని ప్రొఫెసర్ హరగోపాల్ పేర్కొన్నారు. ఆదివారం భారత్ బచావో సంస్థ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలోని టీఎన్జీఓ భవన్లో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ దేశంలోని సంపదను అన్ని వర్గాల ప్రజలు సమానంగా అనుభవించాలని మన రాజ్యాంగంలో రాసుకునప్పటికీ పాలకులు మాత్రం కొందరి కోసమే అన్నట్లుగా పనిచేస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోందన్నారు. 75 సంవత్సరాల స్వతంత్ర దేశంలో పాలకులు పేదల కోసం ఏం చేశారని చూస్తే ఏమీ కనిపించదు.. కానీ, పెట్టుబడిదారుల కోసం మన రాజ్యాంగంలో రాసుకున్న చట్టాలను అధిగమించి పంచుతున్నారని చెప్పారు. సమావేశంలో భారత్ బచావో జాతీయ కన్వీనర్ ఇన్నయ్య, జహీర్ అలీఖాన్, డాక్టర్ మువ్వ రామారావు, ఎంఫ్ గోపినాథ్, దర్శనం నర్సింహ, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, అలెగ్జాండర్, చింతల యాదగిరి, ప్రభాకర్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

అడుగంటిన ఆశలు

- 519 అడుగులకు పడిపోయిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం
- పది టీఎంసీలు మాత్రమే వినియోగించుకునే అవకాశం
- అవి కూడా తాగునీటి అవసరాలకే సరి..
- కృష్ణా నదికి వరదలు వస్తేనే కాల్వలకు నీటి విడుదల
- సర్కారు ముందస్తు సాగు లక్ష్యానికి విఘాతం



నాగార్జునసాగర్ ప్రాజెక్టులో అడుగంటిన నీరు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ఆయకట్టుకు నీటి విడుదల చేసే అవకాశాలు ఇప్పట్లో కానరావడం లేదు. ప్రాజెక్టులో నీరు అడుగంటడంతో రైతులు దేవుడిపై భారం వేసి ఆకాశం వైపు చూస్తున్నారు. కృష్ణానదిపై గల సాగర్ జలాశయంతో పాటు ఎగువన గల శ్రీశైలం, జూరాల, నారాయణపూర్, ఆల్మట్టి, తుంగభద్ర ప్రాజెక్టులన్నీ బోసిపోయి ఉన్నాయి. సాగర్ జలాశయం గరిష్ట నీటిమట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 519.90 అడుగులు (149.0933టీఎంసీలు) నీరుంది. సాగర్ ప్రాజెక్టు కనిష్ట స్థాయి నీటిమట్టం 510 అడుగులు (133టీఎంసీలు). అంటే.. ప్రాజెక్టులో నుంచి మరో 10టీఎంసీల నీటిని మాత్రమే వాడుకునే వీలుంది. సాగర్ నుంచి హైదరాబాద్ జంట నగరాలతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలు గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతోంది. ఇప్పుడున్న నీరు తాగునీటి అవసరాలకే సరిపోతుందని ప్రాజెక్టు అధికారులు అంటున్నారు. ఎగువన శ్రీశైలం జలాశయంలో 808.60 అడుగుల నీరు (33.577టీఎంసీలు) మాత్రమే ఉంది. ఇప్పటి వరకు కృష్ణానది పరీవాహక ప్రాంతాల్లో వర్షాల జాడేలేదు. ఆల్మట్టి, నారాయణపూర్, తుంగభద్ర జలాశయాలు వట్టిపోయి ఉన్నాయి. అవి నిండితేనే దిగువకు నీరు వస్తుంది. ఈయేడు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు సాగు చేపట్టాలని రైతులకు సూచించినా.. నీటి లభ్యత లేకపోవడంతో లక్ష్యం నెరవేరేలా లేదు.

ప్రతి ఏడాది ఆలస్యమే..

నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఆయకట్టుకు నీటి విడుదల ప్రతి ఏడాది ఆలస్యమవుతూనే ఉంది. 2016లో ఆగస్టు 18న కాల్వలకు నీటిని విడుదల చేశారు. 2017 సంవత్సరంలో సెప్టెంబర్ 21న విడుదల చేశారు. 2018లో ఆగస్టు 22న విడుదల చేయగా, 2019లో ఆగస్టు 11న, 2020లో ఆగస్టు 24న, 2021లో ఆగస్టు 5న నీరు విడుదల చేశారు. గత ఏడాది జూలై 28న కాల్వలకు నీటిని విడుదల చేశారు. వాస్తవంగా సాగర్ ఆయకట్టుకు ఏటా జూన్ 15 నుంచి ఖరీఫ్‌కు నీరు ఇవ్వాలని గెజిట్‌లో ఉంది. కానీ కొన్నేళ్లుగా జూలై 15 లేదా ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో నీటి విడుదుల జరుగుతోంది. దీనివల్ల పంటల దిగుబడి తగ్గిపోవడంతో పాటు నీరు ఇస్తారా? లేదా? అన్న ఆందోళన ఏటా అన్నదాతల్లో వ్యక్తమవుతోంది. కృష్ణానదికి ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వరదలు వచ్చే అవకాశం ఉన్నందున రిజర్వాయర్‌లో ప్రతి సంవత్సరం 530 అడుగుల వరకు కనీస నిల్వ ఉండాలని గెజిట్‌లో ప్రచురించారు. వరదలు వచ్చే వరకు ఈ నీటిని ఉపయోగించుకుంటూ తర్వాత వచ్చే వరదలను పంటలకు వినియోగించుకోవచ్చనే ఉద్దేశంతో ఈ నిబంధన పొందుపరిచారు. కానీ, పలు కారణాలతో ప్రభుత్వాలు నీటిని అధికంగా వినియోగించుకుంటున్నాయి. దీంతో శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వాయర్లలో కనీస నీటి నిల్వ లేకుండా పోతోంది. ఖరీఫ్ పంటకు ప్రారంభంలో నీరు అందని దుస్థితి ఏర్పడుతోంది. ఏటా ఇదే పరిస్థితి నెలకొంటున్నా.. ప్రభుత్వం గానీ, అధికారులు గానీ దిద్దుబాటు చర్యలు చేపట్టడం లేదు. కనీసం ఆగస్టు 1వ తేదీ లోగానైనా కాల్వలకు నీరివ్వగలిగితే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. దీని ద్వారా అధిక దిగుబడులు సాధించడంతో పాటు రెండో పంటగా ఆరుతడి పంటలు సాగుచేసుకునే అవకాశాలుంటాయని రైతులు అభిప్రాయపడుతున్నారు.

క్లుప్తంగా

ట్రాక్టర్ కిందపడి యువకుడి దుర్మరణం



శ్రీరాం(ఫైల్)

పాలకవీడు: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జాన్‌పహాడ్ గ్రామానికి చెందిన తవిడబోయిన శ్రీరాం(22) చిన్నతనంలో తల్లిదండ్రులు చనిపోవడంతో అమ్మమ్మ వద్ద పెరిగాడు. శ్రీరాం ట్రాక్టర్‌తో పొలం దున్నుతుండగా ఫిట్స్ రావడంతో అదే వాహన టైరుకింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. శ్రీరాం తాత పిట్టల చిన్నసైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ఉపేంద్రచారి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

చిట్యాల: జాతీయ రహదారిపై చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ శివారులో శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. వెలిమినేడు గ్రామ శివారులోని హనుమాన్ ఆలయం సమీపంలో విజయవాడ వైపునకు నడుచుకుంటూ వెళుతున్న గుర్తుతెలియని వ్యక్తిని వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహం పైనుంచి పలు వాహనాలు వెళ్లడంతో ఛిద్రమైంది. మృతుడి వయస్సు సుమారుగా 50–55 ఏళ్ల మధ్యలో ఉంటుందని, ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఇరుగు రవి తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



చంద్రియా మృతదేహం

మేళ్లచెరువు : విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మేళ్లచెరువు మండలంలోని కప్పలకుంట తండా గ్రామపంచాయతీ పరిధిలోని శివబాలాజీనగర్ తండాలో ఆదివారం చోటు చేసుకుంది. శివబాలాజీనగర్ తండాకు చెందిన చంద్రియా (65) తన వ్యవసాయ భూమిలో తెగిపడిన విద్యుత్ తీగలు గమనించలేదు. చంద్రియా పని చేసుకుంటున్న సమయంలో తీగలకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. స్థానిక రైతులు గమనించేలోపే మృతిచెందాడు. మృతుడి భార్య మోతీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

హైవేపై.. పోలీస్ ఫోకస్ !

- రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు
- జీఎమ్మార్ సంస్థ సమన్వయంతో సూచికలు, సిగ్నల్స్ ఏర్పాటు
- అవసరమున్న చోట స్పీడ్ బ్రేకర్లు, విద్యుత్ దీపాలు కూడా..
- రోడ్డు వెంట గ్రామాల్లో పోలీస్ కళాజాతాలతో ప్రమాదాలపై అవగాహన



నకిరేకల్‌లోని పద్మానగర్ జంక్షన్



తాటికల్ అండర్ పాస్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు

నకిరేకల్ : జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు పోలీస్ యంత్రాంగం ప్రత్యేక చర్యలకు శ్రీకారం చుట్టింది. ఇటీవల హైవేపై జరుగుతున్న వరుస రోడ్డు ప్రమాదాలపై పోలీస్‌శాఖ అప్రమత్తమైంది. నల్లగొండ ఎస్పీ అపూర్వరావు ఆదేశాల మేరకు ప్రత్యేక పోలీస్ బృందం, జీఎమ్మార్ సంస్థ అధికారులు, సిబ్బంది సమన్వయంతో హైవేపై పర్యటిస్తూ ప్రమాద నివారణ చర్యలు చేపడుతున్నారు. జీఎంఆర్ సంస్థ రూ.1740 కోట్లు వెచ్చించి బీవోటీ పద్ధతిలో 65వ నంబర్ రహదారిని నిర్మించారు. ఉమ్మడి జిల్లాలో ఈ రహదారి181 కి. మీ. ఉంది. చౌటుప్పల్ నుంచి కోదాడ వరకు జాతీయ రహదారిపై ఉమ్మడి జిల్లాలో 11పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. ఈ రహదారిపై పూర్తిస్థాయిలో ప్రమాదాల హెచ్చరిక బోర్డులు, సర్వీస్ రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు నిర్మించలేదు. కూడళ్ల వద్ద పూర్తి స్థాయిలో వెలుగులు లేక రాత్రి పూట ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారిపై గ్రామాలు మండల కేంద్రాల వద్ద ఎక్స్ వై జంక్షన్లు, రోడ్డు క్రాసింగ్‌ల వద్ద సరైన విద్యుత్ దీపాలు హెచ్చరికల దీపాలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. చౌటుప్పల్ శివారు లోని పంతంగి టోల్ ప్లాజా నుంచి కేతేపల్లి శివారులోని కొర్లపాడు టోల్ ప్లాజా వరకు ఆయా రోడ్డు క్రాసింగ్‌ల వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి.

సూచిక బోర్డులను గమనించాలి

జాతీయ రవాదారిపై నిత్యం ఎక్కడో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. నకిరేకల్ నియోజకవర్గంలో గుండ్రాంపల్లి నుంచి టేకుమట్ల వరకు 19 బ్లాక్ స్పాట్‌లను గుర్తించాం. వాహనదారులు రోడ్డుపై ఏర్పాటు చేసి ప్రమాద సూచిక బోర్డులను గమనించాలి. పక్షం రోజుల నుంచి ఎస్పీ అపూర్వరావు ఆదేశాల మేరకు హైవే జీఎంఆర్ అధికారులతో ప్రమాద నివారణ చర్యలు చేపడుతున్నాం. వాహనదారులు ట్రాఫిక్ నింబంధనలు పాటించాలి.

–అంజయ్య, రోడ్డు సేఫ్టీ ప్రత్యేక అధికారి, ఎస్పీ కార్యాలయం

నివారణ చర్యలు ఇలా..

ఎస్పీ అపూర్వరావు ఆదేశాల మేరకు ఎస్పీ కార్యాలయ విభాగం రోడ్డు సేఫ్టీ ప్రత్యేక అధికారి అంజయ్య ఆధ్వర్యంలో హైవే వెంట పర్యటించి ప్రమాదాలు జరిగే ప్రాంతాల వద్ద ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఆయా టోల్‌ప్లాజా వద్ద ఉన్న జీఎంఆర్ సంస్థ అధికారులతో చర్చించి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అక్కడ చేపట్టాల్సిన పనులను చేయిస్తున్నారు. వారం రోజుల క్రితం ఇద్దరి ప్రాణాలను బలిగొన్న తాటికల్ అండర్ పాసింగ్‌కు ఇరు వైపులా స్పీడు బ్రేకర్లను నిర్మించారు. రోడ్డు చెదిరిపోయిన పేయింటింగ్ సిగ్నల్స్‌ను తిరిగి రాయిస్తున్నారు. జంక్షన్లు, రోడ్డు క్రాసింగ్‌ల వద్ద నూతనంగా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయిస్తున్నారు. రోడ్డుపై రాత్రి వేళల్లో పాడి గేదెల వచ్చి ప్రమాదాలకు కారణం అవుతున్నందున వాటి కొమ్ములకు లైటింగ్‌తో కనిపించేలా రేడియం స్టిక్కర్లను అంటించి యాజమానులకు అవగాహన కల్పిస్తున్నారు. హైవే వెంట ఉన్న గ్రామాల్లో క్రాసింగ్‌ల వద్ద జరిగే ప్రమాదాలపై కూడా పోలీస్ కళాజాతా ప్రదర్శనలు ఇస్తూ అవగాహన కల్పిస్తున్నారు.



అండర్ పాస్ వద్ద ఏర్పాటు చేసిన లైట్లు

గడ్డి మందు తాగిన యువతి మృతి



సంధ్య(ఫైల్)

పెద్దవూర: గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువతి మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దవూర మండలంలోని జయరాంతండాకు చెందిన కెతావత్ పాండుకు ఇద్దరు భార్యలు ఉన్నారు. పెద్ద భార్య కీరికి ఇద్దరు కూతుళ్లు. వీరిద్దరికి వివాహాలు అయిపోయాయి. 22 ఏళ్ల క్రితం పాండు రెండో వివాహం చేసుకున్నాడు. చిన్న భార్య రాజీకి కూతురు సంధ్య(18), ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆస్తుల విషయంలో కొంతకాలంగా వీరి కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 22వన పాండు, చిన్న భార్య రాజీకి గొడవ జరిగింది. ఈ గొడవలో పాండు, అతని మొదటి భార్య కీరి, కుటుంబ సభ్యులు రాజీని, ఈమె కూతురు సంధ్యను తిట్టారు. దీంతో సంధ్య తీవ్ర మనస్తాపానికి గురై అదే రోజు వ్యవసాయ పొలంలోకి వెళ్లి గడ్డి మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతిచెందింది. సంధ్య ఇంటర్మీడియట్ పూర్తి చేసింది. మృతురాలి తల్లి రాజీ ఫిర్యాదు మేరకు పాండు, అతని పెద్ద భార్య కీరి, వారి కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పచ్చిపాల పరమేష్ తెలిపారు.

ఉరేసుకుని యువకుడి బలవన్మరణం



రాము(ఫైల్)

యాదగిరిగుట్ట రూరల్: ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు.ఈ ఘటన యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. వంగపల్లి గ్రామానికి చెందిన యాకరి రాము (22) యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపోలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజువారీలాగే శనివారం విధులు నిర్వర్తించి తిరిగి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో ఇంట్లోనే తన గదిలో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు లేచి చూసేసరికి అప్పటికే మృతిచెందాడు. రాము ఆత్మహత్య చేసుకునే ముందు లవ్ యూ రా తమ్ముడు..అని స్టేటస్ పెట్టుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడి తండ్రి అంజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదయ్య తెలిపారు.

రామాపురంలో...

నేరేడుచర్ల : ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన మొండె నాగరాజు (35) కొంతకాలంగా మద్యానికి బానిసగా మారాడు. ఆర్థిక ఇబ్బందులకు తట్టుకోలేక శనివారం మధ్యాహ్నం ఇంటి వద్దనే గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపారు.

చేపల చెరువులో విష ప్రయోగం

- క్వింటా చేపలు మృతి



చనిపోయిన చేపలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ

అడ్డగూడూరు : గుర్తుతెలియని వ్యక్తులు చేపల చెరువులో విష ప్రయోగం చేశారు. ఈ ఘటన అడ్డగూడూరు మండలం వెల్దేవి గ్రామంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. వెల్దేవి గ్రామ సర్పంచ్ పిల్లి శ్రీకళా సుందర్ ఎకరం వ్యవసాయ భూమిలో చెరువు తవ్వించి చేపలు పెంచుతున్నాడు. ఉదయం చెరువు వద్దకు వెళ్లి చూడగా చేపలు చనిపోయి నీటిపై తేలియాడుతూ కనిపించాయి. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ ఉదయ్ కిరణ్, పశు వైద్యాధికారి నవీన్‌రెడ్డి చెరువును పరిశీలించారు. దుండగులు శనివారం రాత్రి విష ప్రయోగం చేయడంతో క్వింటా వరకు చేపలు మృతిచెందాయని గుర్తించారు. గత మే నెలలో కూడా దుండగులు చెరువులో విష ప్రయోగం చేశారని బాధితుడు తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మానవత్వం చాటుకున్న పూర్వ విద్యార్థులు

- కోమాలోకి వెళ్లిన మిత్రుడి కుటుంబానికి రూ.లక్ష సాయం



నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కనగల్ : ఆపదలో ఉన్న మిత్రుడి కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థికసాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు.. జి.యడవల్లి ఉన్నత పాఠశాల 1997–98బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు. యడవల్లి పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి పర్సనబోయిన చైత్రయ్య ఐదు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రిలో చేర్పించగా కోమాలోకి వెళ్లినట్లు వైద్యులు తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన చైత్రయ్య కుటుంబాన్ని ఆదుకునేందుకు స్నేహితులు ముందుకొచ్చారు. తమకు తోచినంత పోగుచేసి చైత్రయ్య భార్యను రూ.లక్ష నగదు అందజేశారు. మిత్రుడు త్వరితగతిన కోలుకోవాలని దర్వేశిపురం ఆలయంలో పూజలు చేశారు.

అనుమతులు లేకుండా లక్కీ డ్రా



వలిగొండలో పోలీసులు అరెస్ట్ చేసిన నిందితులు

- ముగ్గురు నిర్వాహకుల అరెస్ట్

వలిగొండ : అనుమతులు లేకుండా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి లక్కీడ్రా నిర్వహిస్తున్న ముగ్గురిని భువనగిరి ఎస్‌ఓటీ పోలీసులు అరెస్ట్ చేశారు. వలిగొండ మండలంలోని వెల్వర్తికి చెందిన కూచిమల్ల సుధాకర్, కూచిమల్ల నాగేష్, కూచిమల్ల భగవంతు శ్రీ మత్స్యగిరి లక్ష్మీ నరసింహస్వామి ఎంటర్ ప్రైజెస్ పేరిట లక్కీ డ్రా స్కీంను ఏర్పాటు చేశారు. వీరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 6వేల మంది నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.500 చొప్పున వసూలు చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని సాయి గణేష్ ఫంక్షన్ హాల్లో లక్కీ డ్రాకు ఏర్పాట్లు చేస్తున్న సమయంలో ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేశారు. నిందితుల నుంచి 6వేల లక్కీ డ్రా నాణేలు, బ్రోచర్, మూడు మొబైల్ ఫోన్లు, 1,23,800 రూపాయల నగదు, ఫ్లెక్సీ, 4 పుస్తకాలను స్వాధీనం చేసుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వలిగొండ ఎస్‌ఐ ప్రభాకర్ తెలిపారు.

లక్కీ డ్రా నిర్వాహకులపై కేసు

భూదాన్‌పోచంపల్లి : లైసెన్స్ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా లక్కీ డ్రా నిర్వహిస్తున్న నలుగురిపై మల్కాజ్‌గిరి ఎస్‌ఓటీ పోలీసులు కేసు నమోదు చేశారు. భూదాన్‌పోచంపల్లి మండలంలోని ఇంద్రియాల గ్రామ శివారులోని జి.వెంకటేశ్ వ్యవసాయ క్షేత్రం వద్ద అమాయక ప్రజల నుంచి లక్కీ డ్రా పేరిట డబ్బులు వసూలు చేస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేశారు. లక్కీడ్రా నిర్వహిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకొని వారివద్ద నుంచి 2,060 నగదు, బ్యాంకులో ఉన్న రూ. 1.91 లక్షల నగదు, లక్కీ డ్రా కూపన్స్, 4 సెల్‌ఫోన్లు, కారు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

పెన్‌పహాడ్ : గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన పెన్‌పహాడ్ మండల పరిధిలోని అనంతారం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అనంతారం గ్రామానికి చెందిన పసుపులేటి జానయ్య సూర్యాపేటలో ప్రైవేట్ టీచర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం ఇంటికి తాళం వేసి జానయ్య పాఠశాలకు, అతడి భార్య కూలి పనులకు వెళ్లారు. గమనించిన దుండగులు ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న నాలుగు తులాల బంగారు, 30 తులాల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. సాయంత్రం జానయ్య తిరిగి ఇంటికి రాగా చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఏఎస్‌ఐ వెంకటరత్నం ఘటనాస్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ఆవులను తరలిస్తున్న ముగ్గురిపై కేసు




పోలీసులు పట్టుకున్న కంటైనర్

కోదాడరూరల్ : అనుమతులు లేకుండా కంటైనర్‌లో హైదరాబాద్‌కు తరలిస్తు న్న ఆవులను ఆదివారం పట్టుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు కోదాడ రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ సాయి ప్రశాంత్ తెలిపారు. విజయనగరం సంత నుంచి హైదరాబాద్‌కు ఓ కంటైనర్‌లో 39 ఆవులను తమిళనాడుకు చెందిన ముగ్గురు వ్యక్తులు తరలిస్తున్నారు. మార్గమధ్యలోని కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్‌లో చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేసి కంటైనర్‌లో పశవులు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఆవులను గోశాలకు తరలించి వాటిని తరలిస్తున్న శ్రీనివాసన్, నరేందర్, సుధాకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

డీసీఎం వాహనం పట్టివేత

చౌటుప్పల్ : అనుమతులు లేకుండా గోవులు, ఎద్దులను తరలిస్తున్న డీసీఎం వాహనాన్ని ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ఒడిశా రాష్ట్రంలో కొనుగోలు చేసిన 57 ఆవులు, ఎద్దులను డీసీఎం వాహనంలో హైదరాబాద్‌లోని బహదూర్‌పురకు తరలిస్తున్నారు. ఆ క్రమంలో చౌటుప్పల్ మండల పరిధిలోని తూప్రాన్‌పేట గ్రామ శివారులో పోలీసులు పట్టుకున్నారు. గోవులు, ఎద్దులను భువనగిరిలోని పశువుల సంరక్షణ కేంద్రానికి, వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ దేవేందర్ తెలిపారు.

రామన్నపేటలో..



పోలీసులు పట్టుకున్న వాహనం

రామన్నపేట : అక్రమంగా తరలిస్తున్న పశువులను రామన్నపేట పోలీసులు ఆదివారం రామన్నపేట మండల కేంద్రంలోని సిరిపురం జంక్షన్‌వద్ద పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నర్సన్నపేట, శ్రీకాకుళం ప్రాంతం నుంచి హైదరాబాద్‌కు రెండు డీసీఎంలలో పశువులను తరలిస్తున్నారు. పైనుంచి పూర్తిగా కవర్‌కప్పి ఎవరికీ అనుమానం రాకుండా వ్యవహరించారు. మండల కేంద్రంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా పశువుల అక్రమ రవాణా వెలుగు చూసింది. జంతు సంరక్షణ చట్టంకు విరుద్ధంగా 107 పశువులను తరలిస్తున్న తొమ్మిది మంది వ్యక్తులపై కేసు నమోదు చేయడంతోపాటు రెండు డీసీఎంలను, ఆరు సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. పట్టుబడిన పశువులను భువనగిరి పశువుల సంరక్షణ కేంద్రానికి తరలించారు. పట్టుబడిన పశువులలో ఆవులు కూడా ఉన్నాయని ఎస్‌ఐ లక్ష్మయ్య తెలిపారు.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

ఆలేరురూరల్ : ఆలేరు పట్టణ శివారులో ఆదివారం 17కిలోల నకిలీ పత్తి విత్తనాలను పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు పట్టుకున్నారు. ఆలేరులోని రెడ్డిగుడెం శివారులో మల్‌రెడ్డి పృథ్వీరెడ్డి వ్యవసాయ బావి దగ్గర హెచ్‌టీబీటీ–3 పత్తి విత్తనాలను నిల్వ చేశారన్న సమాచారంతో ఎస్‌ఐ వెంకట శ్రీను, వ్యవసాయ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. మల్‌రెడ్డిని అదుపులోకి తీసుకొని విచారించగా సత్తెనపల్లికి చెందిన పెరుమాల్‌రావు వద్ద కొనుగోలు చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా, మల్‌రెడ్డి వద్ద ఈ నెల 5వ తేదీన 6కిలోల పత్తి విత్తనాలను పోలీసులు పట్టుకున్నారు.

మిర్యాలగూడ హౌసింగ్‌బోర్డు కాలనీలో చోరీ



దుండగులు తెరిచిన బీరువా

మిర్యాలగూడ అర్బన్: గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఇంటి కిచెన్ తలుపులు పగులగొట్టి లోనికి చొరబడి చోరీకి పాల్పడ్డారు. మిర్యాలగూడ పట్టణంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో నివాసముంటున్న గుంటోజు సతీష్ స్థానిక బాటా షోరూంలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం డ్యూటీకి వెళ్లి రాత్రి 11 గంటలకు తన నివాసానికి చేరుకుని నిద్రపోయాడు. ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలిని వ్యక్తులు కిచెన్ తలుపులను పగులకొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలో దాచిన 4.5 తులా బంగారు ఆభరణాలతో పాటు రూ.25వేలను చోరీ చేశారు. తెల్లవారాక బీరువా తెరిచి ఉండటంతో చోరీ జరిగిందని గుర్తించారు. సమాచారం ఇవ్వడంతో వన్‌టౌన్ పోలీసులతో పాటు డీఎస్పీ వెంకటగిరి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ అనంతుల శివతేజ్ పేర్కొన్నారు.

నీలగిరిలో నిర్బంధ తనిఖీలు

- ధ్రువపత్రాలు లేని 24 వాహనాలు స్వాధీనం



అనుమానితులకు కౌన్సిలింగ్ ఇస్తున్న పోలీసులు

నల్లగొండ క్రైం : నల్లగొండ పట్టణంలో ఆదివారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సతీష్‌నగర్‌లో నిర్వహించిన నిర్బంధ తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 24 బైక్‌లను స్వాధీనం చేసుకుని, 32మంది అనుమానితులను విచారించారు. వాహనాల డాక్యుమెంట్లను పరిశీలించారు. ప్రజల్లో పోలీసుల పట్ల భరోసా, సంఘ విద్రోహులపట్ల కఠినంగా వ్యవహరించేందుకే ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. తనిఖీల్లో సీఐలు గోపి, పీఎన్‌డీ ప్రసాద్, ఆదిరెడ్డి, ఎస్సైలు కంచర్ల భాస్కర్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, సంపత్,సైదులు, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

హిందూధర్మ పరిరక్షణకు కంకణబద్ధులు కావాలి

రామన్నపేట : హిందూధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని హిందూ ధర్మప్రసార తెలంగాణ విభాగ్ వెంకటేశ్వర జాదవ్, తెలంగాణ ధూపదీప నైవేద్యం సంఘం అధ్యక్షుడు డాక్టర్ రామలింగేశ్వరశర్మ అన్నారు. ఆదివారం రామన్నపేటలో జరిగిన విశ్వహిందూ పరిషత్, ధర్మ ప్రసార సమితి, గ్రామసత్ సంఘాల సమ్మేళనంలో వారు మాట్లాడారు. హిందూ ఆచారాలు, సంప్రదాయాలు సనాతనమైనవని, ప్రజలు పాశ్చాత్య దేశాల సంస్కృతి మోజులో పడి విస్మరించరాదన్నారు. భావితరాలకు హిందూ సంస్కృతి, సంప్రదాయాలను అలవాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ మండల అధ్యక్షుడిగా నోముల శ్రీనివాస్, సహాయసత్‌సంఘ ప్రముఖునిగా దంతూరి యాదగిరి, సహాయ కార్యదర్శిగా రాపోలు అండాలును ఎన్నుకున్నారు. సమ్మేళనంలో వీహెచ్‌పీ తెలంగాణ ప్రాంత సహాయ కార్యదర్శి తొట్ల భానుప్రసాద్, జిల్లా అధ్యక్షుడు గరిసె శేఖర్, జిల్లా సహాయ కార్యదర్శి యతిరాజస్వామి ధర్మరక్షణ్ ప్రముఖ్ పసునూరి నిత్యానందం పాల్గొన్నారు.

జాలరికి చిక్కిన భారీ చేప

నల్లగొండ జిల్లా కేంద్రం శివారులోని పానగల్లు ఉదయ సముద్రం రిజర్వాయర్‌లో ఆదివారం ఖాజీరామారం గ్రామానికి చెందిన జాలర్లు చేపలు పట్టారు. చెరువులో ఓ జాలరి వేసిన గాలానికి 20కిలోల బొచ్చ చేప చిక్కింది. గ్రామస్తులు ఆ భారీ చేపను చూసేందుకు పోటీపడ్డారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, నల్లగొండ



నాలుగు తులాల పుస్తెలతాడు చోరీ

చింతపల్లి : గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి ఇంట్లోకి చొరబడి ఓ మహిళ మెడలోంచి నాలుగు తులాల పుస్తెల తాడును చోరీ చేశారు. ఈ ఘటన చింతపల్లి మండల పరిధిలోని ప్రశాంతపురితండాలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సతీష్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రశాంతపురితండాకు చెందిన ఇస్లావత్ చాంది శనివారం రాత్రి ఇంట్లో నిద్రపోయింది. ఈ క్రమంలో దుండగులు ప్రవేశించి ఆమె మెడలో ఉన్న నాలుగు తులాల పుస్తెల తాడును అపహరించారు. ఆమె నిద్ర నుంచి మేల్కొని కేకలు వేయడంతో దొంగలు పరారయ్యారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎనిమిది మంది జూదరుల అరెస్ట్

హుజూర్‌నగర్: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి 8మంది జూదరులను అరెస్ట్ చేశారు. హుజూర్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో కస్తూరి పుల్లమ్మ ఇంట్లో శనివారం రాత్రి పేకాట ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో అక్కడ పేకాట ఆడుతున్న కస్తూరి కిషోర్, జక్కవేని శ్రీను, ముంజల నాగరాజు, కలకోవ వెంకటేశ్వర్లు, మేదరిమెట్ల నర్సింహారావు, ముంజల సైదులు, జాకరపు కిరణ్, దేవరం సుధాకర్ రెడ్డిలను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ 12,540 నగదు, 8 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

బీజేపీతోనే అభివృద్ధి

బొమ్మలరామారం : బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సూదగాని హరిశంకర్‌గౌడ్ అన్నారు. ×మహాజన్ సంపర్క్ అభియాన్×లో భాగంగా ఆదివారం బొమ్మలరామారం మండలం ఫక్కీరుగూడెంలో ఇంటింటికి బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో దూసుకెళ్తుందన్నారు. రాష్ట్రంలోనూ బీజేపీకి రోజురోజుకూ ఆదరణ పెరుగుతుందన్నారు. బీజేపీని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జగ్గర్ల ఆనంద్ గౌడ్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వేముల నరేష్, గులారి నర్సింహ, మైలారం ఉపసర్పంచ్ సిద్దెంకి బాబు పాల్గొన్నారు.